క్లుప్తంగా

కుక్కల దాడిలో జింక మృతి


జింకకు పోస్టుమార్టం చేస్తున్న గుత్తి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నారపరెడ్డి

యాడికి: మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లి సమీపంలో శుక్రవారం మేత మేస్తున్న ఓ జింకను కుక్కలు దాడి చేసి, గాయపరిచాయి. పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతులు చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, బాలకృష్ణ, రామకృష్ణ గమనించి కుక్కలను తరిమేశారు. గాయపడిన జింకను చికిత్స నిమిత్తం యాడికిలోని పశువుల ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రి సిబ్బంది జింకకు వైద్యం చేస్తుండగా మృతి చెందింది. సమాచారం అందుకున్న గుత్తి ఫారెస్ట్ సెక్షన్ అధికారి నారప రెడ్డి యాడికికి చేరుకున్నారు. మృతి చెందిన జింకకు పోస్టుమార్టం నిర్వహించి, ఖననం చేశారు. కార్యక్రమంలో ఫారెస్టు సిబ్బంది చంద్రశేఖర్ రెడ్డి, రామాంజి పాల్గొన్నారు.

శుభకార్యం

యాడికి: కమలపాడు మాజీ సర్పంచ్, వీరారెడ్డి పల్లికి చెందిన పేరం భీమేశ్వర రెడ్డి, పేరం సరోజమ్మ దంపతుల కుమారుడు పేరం జనార్దన రెడ్డి, సుచిత రెడ్డిల వివాహం శుక్రవారం మండల కేంద్రంలోని టీడీపీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ వివాహానికి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానంద రెడ్డి, పేరం కులశుఖర్ రెడ్డి, పేరం జగదీశ్వర రెడ్డి, నాయకులు కోనా జగదీశ్వర రెడ్డి, బీసీ మల్లికార్జున, రసూల్, రామిరెడ్డి, నిట్టూరు రామాంజనేయులు రెడ్డి, చలపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడిక తీయించాలని వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లు: పట్టణంలోని చిన్న, పెద్ద డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీయించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నయిమ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో చిన్నపాటి వర్షానికి పొంగిపొర్లుతున్నాయని తెలిపారు. రోడ్లపై మురుగు ప్రవహిస్తోందన్నారు. దోమలు ప్రబలి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని అరికట్టడంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పేరుకుపోయిన పూడిక తీయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు సాకే నాగరాజు, నాయకులు సురేంద్ర, రంగమ్మ, తిమ్మప్ప, అబ్దుల్లా, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


సచివాలయ ఉద్యోగులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ, ఊబిచెర్ల గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ ఆయా గ్రామాల్లో పర్యటించారు. తాగునీటి సమస్య ఉందని ఫిర్యాదులు అందిన కాలనీల వద్దకు వెళ్లి నీటి సమస్యకు గల కారణాలను తెలుసుకున్నారు. చిన్న పాటి సమస్యలు ఉన్నాయని.. పైప్‌లైన్లకు మరమ్మతులు చేయించి నీటిని సరఫరా చేస్తామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది రోజూ సమయపాలన పాటించాలని సూచించారు. గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు సమస్యలు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు.

31 నుంచి క్రికెట్ టోర్నీ

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామంలో ఈనెల 31 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గాంధీ, కేదార్, శేఖర్, లక్ష్మణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాట సుంకులమ్మ ఓపెన్ క్రికెట్ టోర్నీలో విన్నర్స్ జట్టుకు రూ.1,16,000, రన్నర్స్ జట్టుకు రూ.50,016 అందిస్తామన్నారు. టోర్నీలో పాల్గొనే జట్లు ఈ నెల 30లోపు రూ.1000 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7396968248, 9701933164 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.


పుట్లూరులో నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ గోదాము

రూ.లక్షలు వెచ్చించి.. నిరుపయోగంగా వదిలేసి

పుట్లూరు: మండల కేంద్రానికి సమీపంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన వ్యవసాయ గోదాము నిరుపయోగంగా మారింది. ప్రత్యేక ప్యాకేజీ అభివృద్ధి నిధులతో నిర్మించిన ఈ గోదామును వినియోగంలోకి తీసుకొస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. గోదాము నిర్మించిన ప్రదేశానికి వాహనాలు వెళ్లడానికి రోడ్డు లేకపోవడంతో గోదాము చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన గోదాము నిరుపయోగంగా ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గోదామును వినియోగంలోకి తీసుకుని రావాల్సిన అవసరం ఉంది.



గుత్తి ఆర్‌ఎస్‌లో తెరచుకోని ఏటీఎం సెంటర్

ఏటీఎం ఉన్నా.. సేవలు సున్నా

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం మూతపడింది. సుమారు 25 రోజులుగా కేంద్రం తెరచుకోవడం లేదు. రైల్వే ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఏటీఎం కేంద్రం పని చేస్తే ప్రయాణికులు డబ్బు డ్రా చేసుకుని టికెట్లు కొనుగోలు చేసేవారు. అయితే ఏటీఎం కేంద్రం మూతపడటంతో ప్రయాణికులు పట్టణంలో ఇతర ప్రాంతాలకు వెళ్లి డబ్బు డ్రా చేసుకుంటున్నారు. మిషన్ చెడిపోవడంతో ఏటీఎం కేంద్రాన్ని బంద్ చేసినట్లు సమాచారం. ఇప్పటికైనా ఎస్‌బీఐ అధికారులు స్పందించి ఏటీఎం కేంద్రాన్ని తెరిపించాలని స్థానికులు కోరుతున్నారు.


గుత్తి బీసీ కాలనీలో నడి రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం

పొంచి ఉన్న ప్రమాదం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీలో నడి రోడ్డుపై విద్యుత్ స్తంభం ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. నడి రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి పక్కన ఏర్పాటు చేయాలని కాలనీవాసులు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


గుంతకల్లు రూరల్: బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది


కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం


శింగనమల: మాట్లాడుతున్న సీడీపీఓ ఉమా శంకరమ్మ

గుంతకల్లు రూరల్: పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా చిన్నారులు, కిశోర బాలికల్లో శారీరక, మానసిక ఎదుగుదల సాధ్యమవుతుందని జిల్లా బాలల పరిరక్షణ సంస్థ అధికారిణి వెంకటేశ్వరి సూచించారు. శుక్రవారం గుంతకల్లు పట్టణంలోని శ్రీలంక కాలనీలో బాలికల భవిష్యత్తుకు కిశోరి వికాసం శిక్షణ తరగతులు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పౌష్టికాహారం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, ఆన్‌లైన్ సేఫ్టీ తదితర వివరాలపై కిశోర బాలికలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ అధికారిణి వెంకటేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: కిశోరి బాలికలు చదువుకుని సాధికారత వైపు పయనించాలని సీడీపీఓ ఉమా శంకరమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ ఉమాశంకరమ్మ మాట్లాడుతూ.. కిశోరి బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. పాఠశాల, కళాశాలకు వెళ్లలేని వారు ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్, ఓపెన్ డిగ్రీ చదువుకోవచ్చని వివరించారు. బాలికలు చదువుకుని ఆదర్శంగా నిలవాని సూచించారు. పోషకాహారం, ఆరోగ్యం, రుతుక్రమం సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. చట్టాలు, హక్కులు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టం, జీవనోపాధి, డయల్ 100, 1098, 112, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, కౌసల్య, వాణిశ్రీ, ఉమాదేవి, మహిళా పోలీస్ శిల్ప పాల్గొన్నారు.

ఆడ మగ ఇద్దరూ సమానమే...

గుంతకల్లు రూరల్: తల్లిదండ్రులు లింగ వివక్ష వీడాలి. ఆడ, మగ ఇద్దరూ సమానమేనని హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నెలగొండ గ్రామంలో నాగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో లింగ వివక్ష, బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు మహిళా అభివృద్ధికి ఆటంకాలని, చిన్న వయసులో పెళ్లిళ్లు ఆడపిల్ల జీవితాన్ని బుగ్గిపాలు చేస్తాయని తెలియజేశారు.

జీతాలు ఇవ్వకపోతే ఎలా సారూ?


నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్య కార్మికులకు గత నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదు. జీతాలు రాకపోవడంతో తామెలా జీవనం సాగించాలని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మొత్తం 11 మంది పారిశుద్య కార్మికులు పని చేస్తున్నారు. నెలకు కేవలం రూ.11,500 మాత్రమే జీతం వస్తుంది. ఆ అరకొర జీతం కూడా గత నాలుగు మాసాలుగా అందకపోవడంతో కార్మికుల కుటుంబాల పోషణ కష్టంగా మారింది. జీతాలు ఇవ్వాలని విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు నెల నెలా ఇచ్చేవారని.. ఇప్పుడేమో ఇవ్వడం లేదని కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత కాంట్రాక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

రహదారి సమస్యను పరిష్కరిస్తాం


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రజాక్ వలి, రూరల్ సీఐలు

తాడిపత్రి: గంగాదేవి పల్లిలో రైతులు పొలాలకు వెళ్లే రహదారిని తహసీల్దార్ రజాక్ వలి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామానికి చెందిన దాదాపు 50 మందికి పైగా రైతుల పొలాలకు వెళ్లేందుకు పూర్వం నుంచే ఒక రస్తా ఉండేది. కానీ అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ప్రస్తుతం ఆ రస్తా తమకు చెందినది అని చెబుతూ రస్తాలో రైతులు తిరగాడకుండా అడ్డుకున్నాడు. బాధిత రైతులు నెల రోజులుగా తహసీల్దార్ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేశారు. రైతు సంఘాల నాయకులతో కలసి కూడా అర్జీలు ఇచ్చారు. స్పందించిన తహసీల్దార్ రజాక్‌వలి, రూరల్ సీఐ శివగంగాధర రెడ్డితో కలసి రస్తాను పరిశీలించారు. రస్తా విషయంలో బాధిత రైతులను టీడీపీకి చెందిన నాయకుడు ఇబ్బంది పెడుతున్నట్లు గుర్తించారు. శనివారం రైతులు కార్యాలయానికి వస్తే అవతలి వ్యక్తిని కూడా పిలిపించి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ఇంటర్న్‌షిప్‌కు 40 మంది ఎంపిక


ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన గేట్స్ విద్యార్థులు

గుత్తి: పట్టణంలోని గేట్స్ పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన 40 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు వైద్య రంగంలో ప్రసిద్ధి చెందిన ఆసా మెడికల్ డివైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు యుటో సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేయనున్నారు. ఒక్కొక్కరికి రూ.16 వేలు ఇవ్వనున్నారు. శుక్రవారం గేట్స్ కాలేజీలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ఎండీ రఘునాథ్ రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ నరసింహులు అభినందించారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన


పంచరత్నాలు పౌరాణిక నాటకంలో ఓ సన్నివేశం

పామిడి: మండలంలోని పాళ్యం గ్రామంలో తెలుగు భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో స్వరరాగ నాటక కళాసమితి సౌజన్యంతో గురువారం రాత్రంతా నిర్వహించిన పంచరత్నాలు పౌరాణిక నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. స్వరరాగ నాటక కళాసమితి సభ్యులు పుంజా కృష్ణారావు యాదవ్, దేవరాజు, రమణమూర్తి, ఆంథోని, హనుమంత రెడ్డి, వనజ కుమారి, నాగవేణి పోటీపడి నటించారు. నరహరి పాత్రధారి దేవరాజు నటన ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను గ్రామ పెద్దలు సన్మానించారు.

నాటుసారా తయారు చేస్తే ఉపేక్షించం


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ నాగసునీతా రాణి

శింగనమల: నాటుసారా తయారు చేయడం, రవాణా, విక్రయించడం నేరం. నేరాలు చేస్తూ పట్టుబడితే రేషన్ కార్డుతో పాటు ప్రభుత్వ పథకాలను రద్దు చేస్తామని బుక్కరాయసముద్రం ఎక్సైజ్ సీఐ నాగసునీతా రాణి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని నాగులగుడ్డం తండాలో ప్రభుత్వ అధికారులు, ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటుసారా విక్రయిస్తున్నట్లు తెలిస్తే 14405 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావు మాట్లాడుతూ.. నాటుసారా నిర్మూలనలో భాగంగా నేరం చేసిన వారికి ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు, ఉపాధి హామీ, ఉచిత రేషన్, పింఛన్, నిరుద్యోగ ఉపాధి కల్పనకు అనర్హులుగా పరిగణిస్తామన్నారు. ఎస్‌ఐ విజయకుమార్ మాట్లాడుతూ.. నాటుసారా తయారు చేసినా, విక్రయించిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ గురురాజ, పంచాయతీ కార్యదర్శి మహిళా పోలీస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి

పెద్దవడుగూరు: రెవెన్యూ, పోలీస్ శాఖల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి, తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెండు శాఖ సమన్వయంతో భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు పొలాలకు వెళ్లే రహదారుల విషయమై తరచూ గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. వాటిని సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 8 మంది నుంచి అర్జీలు స్వీకరించడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు. సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తిరంగా యాత్ర



నినాదాలు చేస్తున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు

తాడిపత్రి రూరల్: పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై మన దేశ దళాలు ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు జరిపి విజయం సాధించినందుకు శుక్రవారం పట్టణంలో తిరంగా యాత్ర నిర్వహించారు. పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, రిటైర్డ్ ఆర్మీ అధికారులు, జాతీయ వాదులు, విద్యార్థులు జాతీయ జెండాలు చేత పట్టుకుని మన సైన్యం చూపిన ధైర్య సాహసాలకు జేజేలు పలికారు. దేశభక్తి గీతాలు, జాతీయ నినాదాలతో తిరంగా యాత్ర మార్మోగింది. పట్టణంలోని గాంధీ సర్కిల్ నుంచి ప్రారంభమైన తిరంగా యాత్ర సీబీ రోడ్డు మీదుగా అశోక్ పిల్లర్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ పేరం నాగిరెడ్డి, బీజేపీ నాయకులు ప్రతాప్ రెడ్డి, అంకాల్ రెడ్డి, రాధాకృష్ణ, పట్టణ సీఐ సాయిప్రసాద్, ఆర్యవైశ్య సంఘం, రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, వాసవి క్లబ్, స్వచ్ఛంద సంస్థల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండ లాగుడు పోటీలు


పోటీల్లో బండను లాగుతున్న వృషభాలు

పెద్దవడుగూరు: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆవులాంపల్లిలో శుక్రవారం అంతర్ రాష్ట్ర ఒంగోలు జాతి వృషభాల బండ లాగుడు పోటీలను ఎస్‌ఐ ఆంజనేయులు ప్రారంభించారు. మొదటి రోజు ఆరుపళ్ల విభాగంలో వృషభాలు పోటాపోటీగా బండను లాగాయి. డీపీఆర్ బుల్స్ మొదటి బహుమతి రూ.50 వేలు, ఆర్.కే బుల్స్‌కు రెండవ బహుమతి రూ.40 వేలు, నంద్యాల గుండం చెన్నారెడ్డి వృషభాలకు మూడవ బహుమతి రూ.35 వేలు, మేకల భానుజ, జయచంద్రారెడ్డి వృషభాలకు నాల్గవ బహుమతి రూ.30 వేలు, ముసాని చంద్రశేఖర్ వృషభాలకు ఐదవ బహుమతి రూ.25 వేలు, కట్టల అరవింద్, మేకల సరోజమ్మ వృషభాలకు ఆరవ బహుమతి రూ.20 వేలు, డబ్బా అంకిరెడ్డి వృషభాలకు ఏడవ బహుమతి రూ.15 వేలు, కాందాపురం సుధాకర్ చిన్నవడుగూరు వృషభాలకు ఎనిమిదవ బహుమతి రూ.10 వేలు, రాజగోపాల్, జేసీబీ కార్తిక్ వృషభాలకు తొమ్మిదవ బహుమతి రూ.9 వేలు, అయ్యవారిపల్లి వెంకటేశ్వరెడ్డి, సాత్విక్‌రామ్ వృషభాలకు పదో బహుమతి కింద రూ.8 వేలు అందజేశారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్‌కు సమస్యలను విన్నవిస్తున్న ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్

పామిడి: రామగిరి ఎంపీటీసీ పరిధి గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని భారత్ భీమ్‌సేన రాష్ట్ర, వ్యవస్థాపక అధ్యక్షుడు పామిడి సాకే ఓబులేసు, రామాంజనేయులు, రామగిరి ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్ కోరారు. శుక్రవారం పామిడికి విచ్చేసిన కలెక్టర్‌కు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసుపత్రికి 50 పడకల గది ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన నిరుపేద వర్గాల వివాహాలకు సర్వే నంబర్ 855–బీలో అంబేద్కర్ భవనం మంజూరు చేయాలన్నారు. రామగిరి యూపీ స్కూల్‌కు అదనపు గదులు, దిబ్బసాని పల్లిలో స్కూల్ భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. తండా గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఇచ్చి, శాలువాతో సత్కరించారు.

గ్రేడ్–2 వీఆర్‌ఓ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా స్వరూప్



బుక్కరాయసముద్రం: ఆంధ్రప్రదేశ్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ గ్రేడ్–2 వీఆర్‌ఓ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా స్వరూప్ ఎన్నికయ్యారు. ఇటీవల రాష్ట్ర, జిల్లా కమిటీ ఏర్పాటులో భాగంగా బీకేఎస్ సచివాలయం–4లో గ్రేడ్–2 వీఆర్‌ఓగా పని చేస్తున్న స్వరూప్‌కు రాష్ట్ర కమిటీలో చోటు లభించింది. ఈ సందర్భంగా స్వరూప్ మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలు

గార్లదిన్నె: గ్రామాల్లో ప్రజలు ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రజలందరూ తమ వంతు బాధ్యతగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడరాదని సూచించారు. వీటికి ప్రత్యామ్నయంగా ప్రతి ఒక్కరూ జూట్ బ్యాగులు, గుడ్డ సంచులు వాడాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నిషేధించి భూమి, జలవనరులు కలుషితం కాకుండా పరిరక్షించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రాకారోత్సవం


భక్తిగీతాలు ఆలపిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని చిన్న విఠోబ దేవాలయంలో శుక్రవారం ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్మిణీ పాండురంగ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితుడు సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల నడుమ స్వామికి పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పాండురంగడుని దర్శించుకున్నారు. అనంతరం రుక్మిణీ పాండురంగ స్వామికి ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు టీటీ నాగభూషణ్ రావు, మంజునాథ్‌రావు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయుడికి పూజలు


అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమద్ జయంతి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి చిత్రపటాన్ని వీధుల్లో ఊరేగించారు. అనంతరం స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అపర ఏకాదశి పూజలు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం అపర ఏకాదశి నిర్వహించారు. చెన్నకేశవ స్వామిని అలంకరించి, తులసీ మాల పూజలు, పంచామృతంతో అభిషేకాలు, కుంకుమార్చన చేపట్టారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.